# మహనీయుల స్ఫూర్తిగా..రాజ్యాంగ బద్ధులమై..!

వాడ వాడలా ఘనంగా
75వ గణతంత్ర దినోత్సవాలు

ఎందరో మహనీయుల త్యాగ ఫలం సర్వసత్తాక ప్రజాస్వామిక భారత రాజ్యాంగం. ఆ మహనీయులు స్ఫూర్తితో రాజ్యాంగబద్ధులమై ఉంటామని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. భారత దేశ 75వ గణతంత్ర దినోత్సవాలను శుక్రవారం ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పట్టణంలోని ఏరియా వైద్యశాలలో, క్రోసూరులో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. - సాక్షి నెట్‌వర్క్‌


సత్తెనపల్లి: జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి రాంబాబు


సత్తెనపల్లి: సబ్ కోర్టులో న్యాయమూర్తి నాగ వెంకటలక్ష్మి, న్యాయమూర్తులు


రాజుపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


సత్తెనపల్లి: ఏరియా వైద్యశాలలో సెక్యూరిటీ గార్డుకు ప్రశంసా పత్రం అందిస్తున్న మంత్రి రాంబాబు


క్రోసూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద విద్యార్థులతో గణతంత్ర దినోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


నకరికల్లు: అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది నివాళి


నకరికల్లు: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దారు కె.నరేష్


సత్తెనపల్లి: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ షమ్మి, చైర్‌పర్సన్ లక్ష్మీతులసి


నకరికల్లు: జెడ్పీ పాఠశాలలో బహుమతులు ప్రదానం చేస్తున్న కన్వీనర్ రాఘవరెడ్డి


ముప్పాళ్ళ: జెండా వందనం చేస్తున్న తహసీల్దారు భవానిశంకర్, ఎంపీడీఓ పుట్టారెడ్డి


పెదకూరపాడు పాఠశాలలో జెండా వందనం


బెల్లంకొండ: గణతంత్ర వేడుకల్లో ఎంపీపీ, అధికారులు


అచ్చంపేట: కంప్యూటర్ ఆపరేటర్ రవిని సన్మానిస్తున్న తహసీల్దారు, జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి


అమరావతి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది జెండా వందనం


పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్సై వెంకట్రావు సెల్యూట్

## క్లుప్తంగా

### రేపు త్యాగరాజ ఆరాధనోత్సవాలు

సత్తెనపల్లి: వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28న సాయంత్రం పట్టణంలోని శరభయ గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాదుకు చెందిన ప్రసిద్ధ సంగీత విద్వాంసులు రవి కులోత్తమరావు హాజరవుతారని తెలిపారు. ఆరాధన ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 29న ఓర్వకల్లు తిరునాళ్ల వేలం పాటలు

క్రోసూరు: అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు గంగాదేవీ పేరంటాళ్లమ్మ దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 29న లైసెన్సు హక్కుల వేలం పాటలు నిర్వహించనున్నట్లు శుక్రవారం దేవస్థానం ఈఓ జి.రామకోటిరెడ్డి తెలిపారు. క్రోసూరులోని వీరభద్ర మల్లేశ్వస్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. లైసెన్సు హక్కులు ఫిబ్రవరి 23 నుంచి 25వ తేదీ వరకు, మార్చి 24 నుంచి 26వ తేదీ వరకు ఉంటాయన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

### సీఐ మంగారావు బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: పెదకూరపాడు సర్కిల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.మంగారావు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో పల్నాడు జిల్లా కాపునాడు, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని గ్రామాలకు చెందిన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 75 మంది నేత్ర శస్త్ర చికిత్సలకు, మరో 60 మందిలో దృష్టి లోపాన్ని గుర్తించి కళ్లజోళ్లకు సిఫారస్ చేసినట్లు శంకర నేత్రాలయ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కాపునాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

### అర్బన్ మార్కెట్‌తో పొదుపు మహిళల అభివృద్ధి



పిడుగురాళ్ల: అర్బన్ మార్కెట్‌తో పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద శుక్రవారం అర్బన్ మార్కెట్ నిర్వహించారు. ఈ అర్బన్ మార్కెట్‌లో సుమారు 82 మంది పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను అమ్మకానికి ఏర్పాటు చేసి ప్రజలకు విక్రయించటం జరిగిందని తెలిపారు. అలాగే పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో రకరకాల మసాల పొడర్లను తయారు చేసే వారిని ప్రోత్సహించటం జరిగిందన్నారు. అందులో భాగంగానే మసాల ఉత్పత్తుల దుకాణాన్ని కూడా ప్రారంభించటం జరిగిందన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు ఈ మార్కెట్ ద్వారా అమ్మకాలు జరపటం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో గణపవరం విద్యార్థి సత్తా



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాయదిగడ నాని గణేష్‌రాజు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి అండర్ 17 విభాగంలో జిల్లా జట్టు నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొన్న ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు మూడోస్థానం సాధించింది. విద్యార్థి వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్‌గా ప్రతిభ చూపాడు. విద్యార్థి ప్రతిభను హెచ్ఎం కృష్ణానాయక్, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మహిళలు ప్రభుత్వానికి అండగా నిలవాలి

- 236 డ్వాక్రా సంఘాలకు రూ.1.02 కోట్ల చెక్కులు అందజేత
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: మహిళా పక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు అండగా నిలవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. శుక్రవారం బెల్లంకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాల్గవ విడత 'వైయస్సార్ ఆసరా' పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు వైఎస్సార్, సీఎం జగన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ చెన్నుపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ కరోనా కష్ట సమయంలో కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి పనిచేస్తే.. ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మండలంలో 236 స్వయం సహాయక సంఘాలకు రూ.1,02,58,489ల నమూనా నగదు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎక్కిరాల మురళి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, దరియా, మహ్మద్ షరీఫ్, మౌలాలి, బడాబచ్చా, సిరిపురం మేస్త్రీ, ఎంపీడీవో వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా సంఘాలకు నమూన నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

## ఎందరికో విద్యాదానం చేసిన గిరినాథ్

సత్తెనపల్లి: ఎందరికో విద్యా దానం చేసిన అఖిల భారత విశ్వకర్మ సంఘ జాతీయ కార్యదర్శి గిరినాథ్ అందరి హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచి పోయారని స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో శుక్రవారం జరిగిన గిరినాథ్ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు కోటగిరి పోతులురయ్య అధ్యక్షత వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ అఖిల భారత విశ్వకర్మ సంఘ జాతీయ కార్యదర్శిగా, విద్యా వేత్తగా, సంఘ సేవకుడిగా గిరినాథ్ సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు సింహాద్రి కనకా చారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చింతాడ బ్రహ్మానందరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ గజ్జల నాగ భూషణ్‌రెడ్డి, డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ గీతాహాసంతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

## ఎమ్మెల్యే నంబూరుపై విమర్శలు అర్థ రహితం


సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

క్రోసూరు: కమీషన్లు, ముడుపుల కోసం నిత్యం పాకులాడే టీడీపీ నాయకుడు కంచేటి సాయిబాబు తన స్థాయిని మరచి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై ఆరోపణలు చేయటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మండిపడ్డారు. గురువారం బీసీ సదస్సు పేరిట తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సదస్సులో కంచేటి సాయిబాబు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ మాట్లాడుతూ బీసీ సదస్సులో బీసీలకు ఏం చేసారో, ఏం చేయబోతున్నారో చెప్పుకోవాలి కానీ ఎమ్మెల్యే శంకరరావును విమర్శించటం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. అన్ని గ్రామాల ప్రజలను కలుసుకుని, వారికి ఎటువంటి అవసరమున్నా వెళ్లి పలకరిస్తున్న ఎమ్మెల్యే నంబూరును విమర్శిస్తే ప్రజలే తరిమి కొడతారన్నారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, టి.అప్పిరెడ్డి, గార్లపాటి దాసు, షేక్ ఖాదర్, ఏసురెడ్డి, దాసయ్య తదితరులున్నారు.

## కొత్త రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం

సత్తెనపల్లి: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించే వారిని గుర్తించి హైదరాబాదులోని హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ గణతంత్ర దినోత్సవాల్లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తోంది. అందులో భాగంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణకు శుక్రవారం డాక్టరేట్, మదర్ థెరిస్సా నేషనల్ బెస్ట్ అవార్డు ప్రదానం చేశారు. బిషప్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశామన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దయానంద్ మాట్లాడుతూ రామకృష్ణకు డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిస్సా నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు కూడా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ ప్రేమానందం, ప్రొఫెసర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్, సర్వీస్ అవార్డు అందుకున్న రామకృష్ణ

## ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: మండలంలోని నందిరాజుపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో రూ.1.80కోట్ల విలువ గల పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం ప్రారంభించారు. నందిరాజుపాలెంలో రూ.35 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, రూ.25లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.41లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కొళాయిలను, బెల్లంకొండ గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో ఆర్బీకే, రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో పాలనలో పెను మార్పులను ముఖ్యమంత్రి తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుపరెడ్డి పద్మా, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, ఎంపీడీవో వెంకటరెడ్డి, పంచాయితీరాజ్ డీఈ గంగానాయక్, ఏఈ పాపారావు, పీహెచ్‌సీ వైద్యుడు కోటేశ్వరరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, ప్రసాదరెడ్డి, భద్రయ్య, సర్పంచ్ మార్శెట్ల సరోజినీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నందిరాజుపాలెంలో కమ్యూనిటీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

## నేడు రూ.5.39 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం


ధరణికోట నూతన సచివాలయ భవనం


అభివృద్ధి చేసిన అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్


నరుకుళ్ళపాడు వెల్ నెస్ హెల్త్ సెంటర్

అమరావతి: మండల పరిధిలోని అమరావతి, నరుకుళ్ళపాడు, మునగోడు, ధరణికోట గ్రామాల్లో రూ.5.39 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించనున్నారు. ఈ గ్రామాల్లో సచివాలయ భవనం, ఆర్బీకే, ముస్లిం కమ్యూనిటీ హాల్, వెల్ నెస్ సెంటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాలను అన్ని హంగులతో నిర్మించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ గంగాధర శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్‌బాబు మాట్లాడుతూ అమరావతిలో రూ.3.29 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రూ.40 లక్షలతో సచివాలయం-2 భవనం, నరుకుళ్ళపాడులో రూ.21.75 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5లక్షలతో హెల్త్‌వెల్ నెస్ సెంటర్, ధరణికోటలో రూ.21.75లక్షలతో ఆర్బీకే, రూ.40 లక్షలతో సచివాలయం, రూ.17.5లక్షలతో హెల్త్ వెల్ నెస్ సెంటర్, రూ.35లక్షలతో ముస్లిం కమ్యూనిటీ హాల్ ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. మునగోడులో రూ.21.75 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు తెలిపారు.

## ఉత్తమ పనితీరుకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి


సత్తెనపల్లి కమిషనర్ కొలిమి షమ్మి


సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్


సత్తెనపల్లి సెబ్ ఎస్ఐ తులసీ


సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు


చల్లగుండ్ల కార్యదర్శి కె.అప్పారావు


అవార్డు అందుకుంటున్న సీఐ ఏవీ బ్రహ్మం

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దారు ఎస్.సురేష్, ఎస్ఈబీ ఎస్ఐ తులసీ, తహసీల్దార్ కార్యాలయ ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు ఉన్నారు.

■ నకరికల్లు: మండలం నుంచి ఎస్ఐ ఏ.రామకృష్ణ, చల్లగుండ్ల పంచాయతీ కార్యదర్శి కె.అప్పారావు, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కె.సుందరరావు, కానిస్టేబుల్ ఎస్.పార్థసారథి, నకరికల్లు-1 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ పడాల శాంతి, కుంకలగుంట-2 సచివాలయం వ్యవసాయశాఖ అసిస్టెంట్ పులి సాయివెంకట్, చీమలమర్రి సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ చిమటా తిరుపతయ్య ఉన్నారు.

■ అమరావతి: జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారానికి సీఐ ఏవీ బ్రహ్మం అందుకున్నారు.

## ఉచిత వైద్య శిబిరంలో 216 మందికి వైద్య సేవలు

నరసరావుపేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ ఆవరణలో శుక్ర వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 216 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో డాక్టర్లు రోగులకు చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన రక్తం, వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే చేసి సుమారు రూ.1.30 లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్నవారికి 30 శాతం రాయితీపై పరికరాలను ఈ సందర్భంగా అందజేశారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 50 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు సూచనలు, సలహాలు అందజేశారు.


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

### నరసరావుపేట కమిషనర్‌గా నిరంజన్‌రెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన బదిలీల్లో నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా పి.నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న ఎం.రామ్మోహన్ నందిగామ పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు.